ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
5
శుక్రవారం 9 ఆగస్టు 2024





■ నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

అడవిబిడ్డల అరిగోస

ప్రభుత్వాలు మారుతున్నా మారని తలరాత

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు
- పూర్తిస్థాయిలో దరిచేరని సర్కారు పథకాలు
- ఐటీడీఏ చేయూతనిస్తున్నా నెరవేరని లక్ష్యం
- విభిన్న జీవనం, పండుగలు వారి సొంతం

వివరాలు : 7 లో..



రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాక రోగిని ఆస్పత్రికి మోసుకెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)



బురదమయంగా ఏటూరునాగారం మండలంలోని కొండాయి- ఊరట్టం రోడ్డు



పాశ్చాత్య పోకడలకు దాసోహం కాని జీవన విధానాలు వారివి.. చెట్టు, పుట్టలే దేవతలు.. పుడమిని, ప్రకృతిని దైవంగా కొలిచే అమాయక మనసులు వారివి. అడవుల్లో ఉంటూ శ్రమైక జీవనాన్ని నమ్ముకుని ఆడంబరాలకు దూరంగా జీవిస్తున్నారు ఆదివాసీలు. ప్రభుత్వాలు తమ వైపు చూడకపోయినా.. పథకాలు ఇవ్వకపోయినా.. అభివృద్ధికి 'బాటలు' వేయక పోయినా.. రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు పటిష్ఠ అమలుకు నోచుకోకపోయినా మానవుడి పోకడల్లో ఎన్ని మార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలను మాత్రం చెక్కు చెదరనివ్వకుండా కాపాడుకుంటున్నారు. ప్రపంచం మారుతున్నా.. అభివృద్ధిలో దూసుకుపోతున్నా వారు మాత్రం అట్టడుగునే ఉంటున్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కేవలం కాగితాలకే పరిమితమవుతుండటంతో ఆ గిరిపుత్రులు ఆవేదన చెందుతున్నారు.

- ఏటూరునాగారం రూరల్

రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్లో గోర్-బోలి భాషను చేర్చండి

- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



మహబూబాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్లో బంజార భాష అయిన గోర్-బోలిని చేర్చాలని మహబూబాబాద్ పోరిక బలరాంనాయక్ కోరారు. న్యూఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో గురువారం బలరాంనాయక్ మాట్లాడారు. భారతదేశంలో గోర్, గౌర్‌బంజార, లామన్, లంబానీ, లంబాడీ, గౌర్‌రాజ్‌పుత్, నాయక్, బల్దియా, గౌరియా వంటి పేర్లతో పిలవబడే బంజారాలు మన విభిన్న సంస్కృతిలో భాగమని చెప్పారు. సుమారు 10 నుంచి 12 కోట్ల జనాభాతో వీరు దేశమంతా విస్తరించి ఉన్నారని, వారందరి ప్రత్యేక భాష అయిన గోర్-బోలిని బంజార, లమాని, లంబాడీ, గోర్మతి, బంజిరీ అనికూడా పిలుస్తారని పేర్కొన్నారు. భారత్‌లోని బంజారాలు ఒకేభాష మాట్లాడుతారని, హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష గోర్-బోలి అని తెలిపారు. ఈ భాషకు లిపిలేదని, శతాబ్దాలుగా ఇది మౌఖిక సంప్రదాయాల ద్వారా మాత్రమే మనుగడలో ఉందన్నారు. రాతపూర్వక డాక్యుమెంటేషన్ లేకపోవడంతో వివక్షతకు దారితీయడమే కాకుండా బంజార సమాజం మొత్తం సాంస్కృతిక వారసత్వం కనుమరుగయ్యే ప్రమాదముందని చెప్పారు. బంజారాలు చరిత్ర లేకుండా వారి ప్రత్యేక భాష, వేషాధారణ, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించగలిగారని, తక్షణమే చర్యలు తీసుకోకుంటే మన జాతీయ వారసత్వంలో భాగాన్ని కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గోర్-బోలి బాషను చేర్చాలని కేంద్రహోంశాఖ మంత్రిని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ డిమాండ్ ఉందన్నారు. బంజార కమ్యూనిటీ గుర్తింపు, పరిరక్షణకు ఇది కీలకమైందని, గోర్-బోలి ఒకభాష మాత్రమే కాదని అది బంజార ప్రజల హృదయం, ఆత్మ వంటిందని కేంద్రప్రభుత్వం ఆలోచించాలని కోరారు.


పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా..

- కేయూ పాలక మండలి కీలక నిర్ణయం
- హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్ వీసీ కరుణ ఆధ్వర్యంలో సమావేశం
- తప్పుడు సమాచారమిచిన డీన్లు, హెచ్‌ఓడీలపై మండిపాటు
- పకడ్బందీగా వర్సిటీ ప్రహరీ గోడ నిర్మాణం
- వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు

వివరాలు 7లో..

మరణించినా.. సజీవమే..

ఒకరి అవయవదానాలతో ఏడుగురికి పునర్జన్మ



- అవయవదానాలపై తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం చైతన్యం
- మానుకోట మెడికల్ కళాశాలకు రెండు దేహదానాలు
- 360 మంది వద్ద అవయవదానాల అగ్రిమెంట్ పత్రాల స్వీకరణ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : అన్నిదానాల్లో అన్నదానం మహామిన్న అన్నది ఒకప్పటి మాట.. అవయవదానాం చేయండి మరొకరికి పునర్జన్మనివ్వండి అన్నది నేటి వాక్కు. ప్రస్తుత సమాజంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, నాణ్యమైన, పౌష్టికాహారం లభించక పోవడం, ఆహారం కలుషితం కావడంతో మానవుడి సగటు జీవితం తగ్గుతూ వస్తోంది. పూర్వ సమాజంలో చాలామంది వందేళ్లు కంటే తక్కువ బతికేవారు కాదు! ప్రస్తుతం ఎప్పుడు ఏ రూపానా ప్రళయం ముంచుకొస్తుందే.. ఏమి వినాల్సి వస్తోందో తెలియని స్థితిలో బతుకుతున్నాం. నేటి పోటీ ప్రపంచంలో వృత్తిరీత్యా పోటీ పడాల్సి రావడంతో నిత్యం పని ఒత్తిడితో వయసుతో నిమిత్తం లేకుండా చిన్నతనంలోనే బీపీ, షుగర్ బారిన పడుతున్నాం. పట్టుమని 40 ఏళ్లు వచ్చాయంటే చాలు.. బీపీ గోలి తన వెంట పెట్టుకుని వెళ్లాల్సిన దైన్యస్థితి. నెలకొంది. ఇక మనం తింటున్న ఆహారం సైతం నాణ్యమైనది లభించకపోవడంతో రోగాల బారిన పడుతున్నాం. తద్వారా శరీరంలోని అవయవాలు పాడైపోతున్నాయి. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. కొన్ని సందర్భాల్లోనైతే ఆర్గానిక్స్ (అవయవాలు) పాడైపోవడంతో యుక్తవయసు, నడీడులోనే ఈ లోకాన్ని వదిలి వెళ్తున్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయాల్లో సైతం ప్రధాన అవయవాలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నారు. అందుకోసం అవయవదానం చేసి చిరంజీవులుగా నిలవడానికి ముందుకు రావాలని కోరుతున్నారు.

ఒకరి అవయవదానంతో..

ఒకరి అవయవదానం వల్ల ఏడుగురికి పునర్జన్మనిచ్చే అవకాశం లభిస్తుంది. తన అవయవదానంతో ఏడుగురిని బతికించిన వారవుతారు. అవయవదానం చేసే వాటిలో ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు (2) కాలేయం, నేత్రాలు(2) వీటిని దానం చేయవచ్చు. బ్రెయిన్‌డెత్ (కోమాలోకి)వెళ్లిన వారినుంచి అవయవాలు సేకరించి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి అమర్చడం వల్ల పునర్జన్మ ప్రసాదించవచ్చు. ఇలా అవయవాలు దానం చేయడం వల్ల అనేక మంది బతికి బట్టగడుతున్నారు. దీంతో వారి కుటుంబాల్లో వెలుగు నిండుతున్నాయి. ఇక చనిపోయాక శరీరాన్ని కాల్చివేస్తే ఎందుకు పనికి రాకుండా బూడిద మిగులుతోంది. అలాంటిది దేహదానం చేస్తే మెడికల్ కళాశాలలో వైద్యవిద్యార్థుల విద్య కోసం ఉపయోగపడుతోంది. ఎనాటమి (శరీర నిర్మాణ శాస్త్రం) నేర్చుకోవడానికి ఉపయోగిస్తారు, డిసెక్షన్ తర్వాత వైద్యకళాశాల సిబ్బంది ఆ దేహానికి దహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తాము చనిపోతూ అవయవాలు దానం చేస్తే ఇతరులను బతికించిన వారమవుతాం.



కొండబత్తుల యాదగిరి నుంచి అవయవ దాన పత్రాన్ని స్వీకరిస్తున్న తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం

రెండు రకాల్లో అవయవ దానం..

అవయవ దానం రెండు రకాల్లో చేయవచ్చు. ఒకటి బతికున్న సమయంలో, మరొకటి మరణించిన తర్వాత చేసేది. మనిషి జీవించిన సమయంలో ఒక మూత్ర పిండం, కాలేయంలో కొంతభాగం దానం చేయవచ్చు.అవి కూడా రక్తసంబంధీకులకు మాత్రమే చేయడానికి వీలవుతుంది. గుండెపోటుతో హఠాత్తుగా మరణం, బ్రెయిన్ డెత్‌తో మరణించే వారికి కృత్రిమ శ్వాసను అందిస్తూ ఆరు నుంచి 8 గంటల సమయంలో అవయవాలను సేకరించవచ్చు. చనిపోయాక దేహాన్ని కాల్చి బూడిద చేయకుండా వెలకట్టలేని అవయవాల దానానికి ముందుకు వస్తే సమాజంలో మరికొంత మందికి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉంటుంది. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు.. కంటి చూపులేక ఎంతో మంది ఈ సమాజాన్ని చూడలేక పోతున్నారు. ఒక్కరి నేత్రదానం వల్ల ఇరువురు అందులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుంది. చనిపోయాక చిరంజీవులుగా బతికే అవకాశం అవయవదానం చేసిన వారికే దుక్కుతుంది.



స్వాతంత్ర సమరయోధులు పోతుగంటి రామస్వామి పార్థివదేహాన్ని మెడికల్ కళశాలకు అప్పగిస్తున్న కుటుంబసభ్యులు (ఫైల్)

తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం చైతన్యం..

అవయవదానాలపై తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజల్లో చైతన్యం నింపుతుంది. అవయవదానాల వల్ల జరిగే ప్రయోజనాలపై కరపత్రాలను ముద్రిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సదస్సులు,

మిగతా 8వ పేజీలో..

పంద్రాగస్టు వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేయాలి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే స్వాతంత్ర్యసమర యోధులు, సీనియర్ సిటిజన్స్, మీడియా ప్రతినిధులు, అతిథుల కోసం ప్రోటోకాల్ ప్రకారం ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖలు సాధించిన అభివృద్ధి పథకాలపై శకటాలు, ఎగ్జిబిషన్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ఉత్తమ సేవలందించిన ఉద్యోగుల వివరాలు అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది గ్రౌండ్ పరేడ్‌కు సంబంధించి ఏర్పాట్లు, అతిథులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, మానుకోట ఆర్డీవో అలివేలు, ఏఎస్పీ చెన్నయ్య, జిల్లా అధికారులు నర్మద, రామారావు, పవన్‌కుమార్, మదనగోపాల్ పాల్గొన్నారు.

తెలంగాణ ఐపాస్ పథకాన్ని వినియోగించుకోవాలి

పరిశ్రమల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ ఐపాస్ పథకం ద్వారా లబ్ధిపొందాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో పరిశ్రమల అభివృద్ధి, తెలంగాణ ఐపాస్‌పై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి 19 దరఖాస్తులు రాగా అందులో 13 దరఖాస్తులను కమిటీ పరిశీలించి నిబంధనల ప్రకారం అనుమతి మంజూరి చేయడం జరిగిందన్నారు. టీప్రైడ్ పథకం ద్వారా రూ.10 లక్షల లోపు రుణాలను మంజూరు చేస్తామన్నారు. పురుష అభ్యర్థులకు 35 శాతం, స్త్రీలకు 45 శాతం సబ్సీడీ రుణాలు మంజూరీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీ కేటగిరీ 35 యూనిట్లకు రూ.1.08 కోట్లు, ఎస్సీ కేటగిరీలో నాలుగు యూనిట్లకురూ.10.77లక్షలు, ఇప్పటి వరకు మొత్తంగాను రూ.1.19లక్షల నిధులను మంజూరిచేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఏ.సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు'

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 8 : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న అన్నారు. డోర్నకల్ మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్నలు ఆయిల్‌పామ్ తోటలను, అంతర్ పంటలను సాగును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరిగా పంటల సాగును నమోదు చేసుకోవాలని కోరారు. అయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, ఉద్యాన పంటలు, డ్రాగన్‌ఫ్రూట్స్, నేరెడు, పనస, మునగ, కరేవేపాకు, మల్బరి, ఎదురు తోటలతో పాటు ఆకు కూరలు సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. సేంద్రియ పద్ధతిలో ఈ తోటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు కర్న అవినాష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలి

వరంగల్ విద్యుత్‌శాఖ సి ఆపరేషన్ అధికారి కిషన్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : వర్షకాలంలో విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాలని వరంగల్ సర్కిల్ విద్యుత్‌శాఖ సి ఆపరేషన్ అధికారి కె.కిషన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 'గృహజ్యోతి' పథకం ద్వారా 97 వేలమంది గృహ వినియోగదారులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారని, ఇంకా జిల్లాలో 20 వేల నుంచి 30 వేల మంది వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. వారందరికి ఈ పథకంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ బకాయిలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మీటర్లులేని వినియోగదారులకు మీటర్లు పెట్టించుకోవాలని, గృహజ్యోతికి అర్హులైన వారందరి వద్దనుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. విద్యుత్‌శాఖ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి అందించాలన్నారు. నెలలో రెండు, మూడో శనివారం మాత్రమే సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌ను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్, ఎస్ఏవో సంతోష్‌కుమార్, సునీత, విజయ్, మధుసూదన్, ఏఏవోలు, జేఏవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్

స్టాఫ్‌నర్సు పట్ల వైద్యుడి అసభ్యప్రవర్తన!

- మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఘటన
- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల శ్రీనివాసరావు

నెహ్రూసెంటర్, ఆగస్టు 8 : జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న ఓస్టాఫ్‌నర్సుపై రాత్రి విధుల్లో ఉన్న ఓ వైద్యుడు లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగింది. స్థానికులు, బాధితురాలు, ఆమె బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న ఓ రెగ్యులర్ వైద్యుడు బుధవారం రాత్రి విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన చికిత్స పేరుతో ఓ విభాగానికి వెళ్లి.. అక్కడ స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఓమహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గురువారం తన కుటుంబసభ్యులకు చెప్పిన సదరు స్టాఫ్‌నర్సు.. ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాంతో తాము ఈ విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకువెళ్లామని శ్రీనివాసరావు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 19వవార్డు పరిధిలోని ఎంపీయూపీఎస్‌లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల వ్యాధులు సంభవిస్తాయని, దోమలు వృద్ధి చెందకుండా నివారించేందుకు మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ విజయ, వార్డు ఆఫీసర్ కృష్ణయ్య, జగన్, సీఎల్ఆర్పీ ఉమా, ఆర్పీ రాజమణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, రమ, ఉపేంద్ర, రాధకృష్ణ, సుల్తానా, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.




ఎంపీయూపీఎస్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి



బోడతండాలో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీలో మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న

- మహబూబాబాద్ మునిసిపల్ 10వ వార్డు పరిధిలో బోడతండా, పాత తండాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయా తండాల్లో ఇంటింటికి సీజనల్ వ్యాధులు, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురికినీరు నిల్వఉన్న ప్రాంతాల్లో తొలగించి బ్లీచింగ్ చలించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, వార్డు ఆఫీసర్ కందూకూరి శ్రీనివాస్, రాంశెట్టి ఉప్పలయ్య దయాకర్, రాజు, నాగులు పాల్గొన్నారు.
- మునిసిపల్ 22, 36 వార్డుల పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఇంటింటికి తిరిగి పరిశుభ్రతపై అవవగాహన కల్పించారు. జేసీబీ సాయంతో మురికినీటిని తొలగించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథిరెడ్డి, యుగేందర్, నల్ల శ్రీను, ఉపేందర్, అశ్వినీ, జ్యోతి, మాధవి, లలిత,పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, తండా శ్రీనాథ్ పాల్గొన్నారు.









వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం

- ఏ జిల్లాకు ఎవరు డీఎంహెచ్‌వోనో తెలియని వైనం
- వరంగల్ జిల్లాలో ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జూలై 8: ఉమ్మడి వరంగల్ వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు గందరగోళానికి దారితీస్తున్నాయి. వైద్యాధికారులు బదిలీ అయిన స్థానాలకు వెళ్లకుండా పాత స్థానంలోనే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్ర వైద్య సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన బదిలీలు, పోస్టింగులపై పలువురు వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బదిలీలపై నిషేధం విధించినప్పటికీ పాత తేదీలపై ఉత్తర్వులు వెలువడుతూనే ఉన్నాయి.

డీఎంహెచ్‌వో ఎవరు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు జిల్లాల్లో అసలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎవరనేది అయోమయంగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంతవరకు మూమెంట్ ఆర్డర్ రాకపోవడంతో ఆయన హనుమకొండలోనే పనిచేస్తున్నారు. ఇక హనుమకొండకు రావాల్సిన ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మూమెంట్ ఆర్డర్ రావడం లేదని ఇంకా ములుగులోనే కొనసాగుతున్నారు. ఇక కరీంనగర్‌కు వెళ్లాల్సి ఉన్న డాక్టర్ వెంకటరమణ ఇదే సాకుతో వరంగల్‌లోనే కొనసాగుతున్నారు.

ఒకే పోస్టులో ఇద్దరు

గత నెల 27న సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సదానందంను బదిలీ చేసి ఆయనస్థానంలో హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.హనుమానాయక్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు విడుదల చేశారు. ఈ మేరకు హనుమనాయక్‌ను సంగెం పీహెచ్‌సీ వైద్యాధికారి విధుల్లో చేర్చుకున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ.. ఈ నెల 8న మరో లేఖ విడుదలైంది. బదిలీ అయిన సదానందంను మళ్లీ అదేస్థానానికి పోస్టింగ్ ఇస్తూ గత నెల 31వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసినట్లు అందులో ఉంది. కాగా, ఇంత హైటెక్ సమాజంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు లేఖ వచ్చేందుకు 8 రోజులు పడుతుందా..? అని ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులను నియమించడం వైద్య, ఆరోగ్యశాఖకే చెల్లుతుందని విమర్శిస్తున్నారు. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారుల తీరు వల్లనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీలపై జ్యుడీషియల్ విచారణ కొనసాగిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఉద్యోగులు అంటున్నారు.

















విద్యార్థులను సత్కరిస్తున్న లయన్ క్లబ్ ప్రతినిధులు

వ్యక్తిత్వ నిర్మాణానికి 'లయన్ క్వెస్ట్' దోహదం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: విద్యార్థుల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి లయన్‌క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఉర్సుగుట్ట వద్ద ఉన్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ సారధ్యంలో ఉపాధ్యాయులకు లయన్ క్వెస్ట్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సక్రమ మార్గంలో నడిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనేక జనాభా ఉన్న మన దేశంలో లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి, క్వెస్ట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజర్ లయన్ శివప్రసాద్ మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంజేపీ ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విద్యార్థుల్లో మానవతా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడేలా వారికి నేర్పించాలన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ఈపాఠశాలల్లో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్వెస్ట్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం గత ఏడాది ఎంజేపీ కళాశాలల్లో ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులను అతిథుల చేతుల మీదుగా సన్మానం చేశారు. శిక్షణ కార్యక్రమానికి శిక్షకురాలుగా కొండపల్లి రేణుక వ్యవహరించగా కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ కందుకూరు వెంకటరెడ్డి, ఫస్ట్ డిప్యూటీ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ప్రోగ్రాం అసిస్టెంట్ కోఆర్డినేటర్ లయన్ పరికిపండ్ల వేణు, లయన్ డాక్టర్ రాజలక్ష్మి, లయన్ మార్గం ప్రభాకర్, లయన్ రవీందర్‌రెడ్డితో పాటు 37 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిస్టరీలో వసంతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ విశ్వవిద్యాలయం హిస్టరీ విభాగం పరిశోధకురాలు ఇటికాల వసంత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి వసంతకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలుగు ప్రాంతంలో మాతంగి సంస్కృతి- ఒక పరిశీలన' అనే అంశంపై కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ పర్యవేక్షణలో వసంత పరిశోధన పూర్తి చేశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన వసంత అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వసంతను పలువురు అభినందించారు.







అడవిబిడ్డల అరిగోస

● అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు ● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8: అడవులే ఆదెరువుగా.. పాశ్చాత్య సంస్కృతి, జీవన విధానానికి దాసోహం కాని కట్టుబాట్లతో.. ప్రకృతినే దేవతలుగా కొలుస్తూ.. శ్రమైక జీవనమే తమ తరగని సౌందర్యమని నిరూపిస్తూ.. ఆత్మగౌరవమే తరగని ఆస్తిగా జీవిస్తున్నారు అడవిబిడ్డలు. ప్రపంచ పోకడల్లో ఎన్ని పెనుమార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలు చెక్కు చెదరవని, వనదేవతలు సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తి, యోధుడు కొమురంభీం తెగువను చాటుతూ తమ అస్థిత్వాన్ని, మనుగడను చెక్కు చెదరనివ్వడం లేదు ఆదివాసీలు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన చట్టాలు, హక్కుల సాధనకు ప్రభుత్వాలు, పాలకులతో అలుపెరగని పోరును నేటికీ కొనసాగిస్తూనే.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. తమ తలరాతలు మారడం లేదంటూ జల్.. జంగల్.. జమీన్ నినాదాన్ని ముందుకు తీసుకుపోతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు నడుం బిగిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు అందకపోతుండటంతో వారు నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల బతుకుచిత్రంపై ప్రత్యేక కథనం.

హక్కులు, చట్టాల అమలుకు నిరంతరం పోరాటమే..

మన రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేకమైన, పటిష్టమైన హక్కులు, చట్టాలను కల్పించినా అవి సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు 1/70 చట్టం రక్షణ కవచమే అయినా ఆ చట్టం అమలు ఆశాజనంగా లేదంటూ ఆదివాసులు ఆవేదన చెందుతున్నారు. 1959లో భారత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల భూములు, ఆస్తులను గిరిజనేతరులు కొనకూడదని చట్టాన్ని తీసుకువచ్చి దీన్ని 1963నుంచి అమలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూములను గిరిజనేతరులు కొనడానికి, అమ్మడానికి వీలు లేదని స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా చట్టానికి పూర్తి అధికారులున్నాయి. 5, 6వ షెడ్యూల్‌లో పెసా గ్రామ సభ ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు జరగాలి. గ్రామసభ తీర్మానం లేనిదే ఎలాంటి పనులు చేయడానికి వీలు లేదు. కానీ ఆ పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని, పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆదివాసీ సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ చట్టం సరిగా అమలు జరిగితే ఆదివాసీగూడేలు అభివృద్ధిపథంలోకి వెళ్లడమే కాకుండా ఆదివాసీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఆదివాసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు భారత రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే అధికారాలు ఇచ్చినా ఆ పరిస్థితులు ఏజెన్సీలో లేకుండా పోయాయి.

గిరిపల్లెలకు ఐటీడీఏ అండ.. సత్ఫలితాలిస్తోందా?

ఆదివాసీ పల్లెలకు ఐటీడీఏ అండగా నిలుస్తోంది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాటుతో ఆదివాసీల పల్లెలకు జీవం పోసినట్లయింది. కానీ అనుకున్నంతా లక్ష్యాలకు ఆమడదూరంలోనే ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న అనుకున్నంతా లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5.30లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. 1986లో ఏటూరునాగారంలో ఐటీడీఏను నెలకొల్పారు. ఐటీడీఏ పరిధిలో మొత్తం 13ఏజెన్సీ మండలాలకు విస్తరించి ఉంది. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఐటీడీఏ పెద్ద దిక్కుగా ఉంటుంది. కానీ ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అనుకున్న లక్ష్యాలను మాత్రం చేరువకాలేదు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సంక్షేమం తదితర శాఖలు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. గిరిజనులకు ఇప్పటికీ రోడ్ల సౌకర్యం లేని గ్రామాల్లో ఎన్నో ఉన్నాయి.

జీవన విధానం, పండుగలు అంతా వైవిధ్యమే

ఆదివాసీల జీవనవిధానం, పండుగలు వైవిధ్యంగా ఉంటాయి. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది ఆదివాసీ తెగలున్నాయి. అంధ్, భిల్, చెంచుతో చెంచువారు, గోండ్ (నాయక్‌పోడ్, రాజ్ గొండ్, కొండరెడ్లు, కొలామ్ (మన్నెవార్లు), కోయ (బినే కోయ, రాజ్ కోయ, పర్ధాన్, తోటి వంటి తెగలు కలవు. గొండ్ ఆదివాసీ తెగ నేగోబా జాతర, జంగుబాయి పండుగను ప్రధానంగా జరుపుకుంటారు. అంధ్ తెగ వారు పూలాజీ బాబా జయంతి, సిరాల్ పండుగను జరుపు కుంటారు. కొలామ్ తెగ వారు భీమా నాయక్ జాతర, నాయక్‌పోడ్ గాంధారి మైసమ్మ జాతర, లక్ష్మీ దేవర పండుగను జరుపుకొంటారు. చెంచులు భౌరాపూర్ జాతర, సలేశ్వరం జాతర, లొద్ది జాతర, కోయలు సమ్మక్క-సారలమ్మ జాతరలను జరుపుకొంటారు. దీంతో పాటు ఆదివాసీలు పెద్దల పండుగ, భూమి పండుగ, ఇప్పపూల పండుగ, చిక్కుడు కాయ, గోంగూర, మొక్కజొన్న పండుగలే కాక కోయ తెగలలో ఇంటి పేరుతో గల ఇలవేల్పుల పండుగలు జరుపుకుంటారు.

ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు రక్షణకు ప్రపంచ దేశాలు నడుం కట్టి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9వ తేదీన 26మందితో స్వతంత్ర మానవ హక్కుల నిపుణులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. తదనంతరం 1994లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీ కమిటీ సమావేశమైన రోజునే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతీ యేటా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతోంది.

ఐటీడీఏలను బలోపేతం చేయాలి



కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏలను ప్రభుత్వం బలోపేతం చేయాలి. గిరిజన గ్రామాలు నేటికీ నిరాధరణకు గురవుతున్నాయి. గిరిజన అభివృద్ధికి బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్నా అవి కాగితాలకే పరిమితమవతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. ఐటీడీఏలను ప్రభుత్వాలు గాలికొదిశాయి. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయాలి.

నేడు కేయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఆగస్టు 9న శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహిస్తామని ఆదివాసీ విద్యార్థి సంఘం కేయూ నేతలు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటీవ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, విశిష్ట అతిథులుగా ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రిటైర్డు అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొరలు పాల్గొని మాట్లాడుతారని వెల్లడించారు.

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల నియామకం



వరంగల్ లీగల్, ఆగస్టు 8: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ)న్యాయవాది రూహీ నబీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రకటన వెలువరించింది. హనుమకొండ అడ్వకేట్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన రూహీ నబీల 2016లో న్యాయవాదిగా నమోదు చేసుకొని కొంతకాలం వరంగల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం హైకోర్టులో తన ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తన తండ్రి సీనియర్ న్యాయవాది మహ్మద్ మైమూద్ వద్ద న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియామకం కావడం పట్ల హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, న్యాయవాదులు ఆనంద్‌మోహన్, జంగా స్వప్న, రమాదేవి, నరేందర్, రహేమాన్, అండాళ్ తదితరులు అభి నందనలు తెలిపారు.

మహిళా పాలిటెక్నిక్‌లో 12న స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: వరంగల్ నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రామప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

కేయూ పాలక మండలి కీలక నిర్ణయం ● వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు



హైదరాబాద్ సచివాలయంలో సమావేశమైన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించేందుకు కేయూ అత్యున్నత పాలక మండలి పచ్చజెండా ఊపి ఆమోదముద్ర వేసింది. వర్సిటీ పీహెచ్‌డీ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు న్యాయం జరగనుంది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నేతృత్వంలో కేయూ కొత్త పాలకమండలి తొలి సమావేశం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ నవీన్, సామాజిక వేత్త పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్ర రాజు, ఏఎస్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమారి, సామాజిక వేత్త చౌహాన్, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యలు పాల్గొన్నారు.

తొలి పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు క్యాంపస్‌లోని వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంపై దాడి చేయడం, తదనంతరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విద్యార్థులను కొట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా కేయూ పీహెచ్‌డీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వర్సిటీలోని అన్ని విభాగాల్లో నూతనంగా విద్యార్థులకు యూజీసీ నిబంధనలు, విద్యార్థుల మెరిట్ మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ అధికారులతో అంతర్గతంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై సమగ్రంగా చర్చించి విధి విధానాలు రూపొందించి విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోయారని, తొందరగా ఒకటి, రెండు రోజుల్లోనే పీహెచ్‌డీ అడ్మిషన్లపై తుది నిర్ణయం తీసుకుని అడ్మిషన్లు చేపట్టాలని పాలక మండలి సభ్యులు నిర్ణయించారు. వర్సిటీలో వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలపై పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ మండిపడినట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చిన డీన్లు, హెచ్‌ఓడీలపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదని కరుణ అన్నట్లు సమాచారం. అలాగే వర్సిటీ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం పాలక మండలి సభ్యులు తీవ్రంగా చర్చించారు. ప్రహరీ నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. వర్సిటీ భూమి ఇంచు కూడా కబ్జాకు గురికాకుండా సర్వే ప్రకారం 100శాతం రక్షించాలని నిర్ణయించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా చిత్తశుద్ధితో భూములను రక్షించాలని సమావేశంలో నిర్ణయించారు.

కాగా, వర్సిటీ క్యాంపస్ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్లాక్ ఆఫ్ లేని సీసీ కెమెరాలను ఆధునీకరించాలని, డేటా బ్యాకప్ ఎక్కువగా ఉండేలా చూడాలని నిర్ణయించారు. అలాగే నూతనంగా వర్సిటీలో మూడు హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించాలని, హాస్టళ్లకు అవసరమైన ఫర్నిచర్ కోనుగోలుకు అనుమతి ఇచ్చారు. అలాగే పార్టుటైమ్, అకడమిక్ కన్సల్టెన్స్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు పాలక మండలి సమావేశం తీపి కబురును నింపింది. వర్సిటీలో మొత్తంగా పార్టుటైమ్, కన్సల్టెన్స్ అధ్యాపకుల్లో వర్సిటీ శాంక్షన్ పోస్టుల్లో పనిచేస్తున్న అధ్యాపకులను అప్‌గ్రేడ్ చేసి కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని నిర్ణయించారు. అయితే శాంక్షన్ బడ్జెట్ పోస్టులు, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఎంత మేర బడ్జెట్ అవసరమవుతుందో చూడాలని, వారి వివరాలను తీసుకుని దాదాపుగా 40 మందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పాలక మండలి సిఫార్సు చేసింది. కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ అయితే నెల నెలా జీతం వచ్చి అధ్యాపకుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటారని పాలకమండలి సభ్యులు సిఫార్సు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తుది నిర్ణయం వెలువరించనుంది. నాన్ బడ్జెట్ పోస్టులు, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పూర్తి వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదు.

వీసీ కోసం..

రాష్ట్రప్రభుత్వం అన్ని వర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను నియమించనున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీకి ఈసీ నామినీగా ఒక్కరిని ఎంపిక చేయాల్సి ఉంది. దీని కోసం ముగ్గురు అనుభవజ్ఞులైన మాజీ వైస్ చాన్స్‌లర్లను పేర్లను ఈసీ సిఫార్సు చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా గురువారం పాలక మండలి ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే వీరిలో ఒక్కరిని ఖరారు చేయాల్సి ఉంది. సోమవారం మరోదఫా పాలక మండలి సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో సమావేశమై ఈసీ నామినీగా ముగ్గురిలో ఒక్కరిని సిఫార్సు చేయనున్నారు.

రిజిస్ట్రేషన్లపై కొత్త అధికారుల కొర్రీలు

● నిబంధనల పేరిట ఇబ్బందులు ● 2,500కు పైగా పెండింగ్‌లో మ్యుటేషన్ సర్టిఫికెట్లు

రాంనగర్, ఆగష్టు 8: నూతన సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు చేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సమాచారం. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 కార్యాలయాల్లోని అటెండర్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో నూతన సిబ్బంది బాధ్యతలు చేపట్టారు.



హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

మ్యుటేషన్ సర్టిఫికెట్లలో..

రిజిస్ట్రేషన్ జరిగాక డాక్యుమెంట్ స్కాన్ చేశాక మ్యుటేషన్ సర్టిఫికెట్ సబ్ రిజిస్ట్రార్ సంతకంతో జారీ చేస్తారు. దీనికి రెండు రోజులు సమయం తీసుకుంటారు. కాగా, బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు రిలీవ్ అయ్యే రోజు వరకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. దీంతో జారీకాని మ్యుటేషన్ సర్టిఫికెట్స్ 2500కు పైగానే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బదిలీ అయిన వారు చేసిన రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్స్‌పై తాము సంతకాలు పెట్ట మని నూతన సబ్ రిజిస్ట్రార్లు మొండికేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇక తల్లిదం డ్రులు, వారి ఆస్తులను పిల్లలకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కొర్రీలు పెట్టి చేయడం లేదని సమాచారం. ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో లేనిపోని నిబంధనల పేరిట చేయడం లేదని తెలిసింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు తగ్గినట్లు సమాచారం. హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీ రోజు 100కు పైగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండేవి. మూడు రోజులుగా 50లోపే జరుగుతున్నట్లు అధికారికంగా తెలిసింది. నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసుకునే వారు సైతం ముందుకు రావడంలేదని సమాచారం. ప్రస్తుతం నెలకొన్న గందరగోళ వైఖరిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుభాషిణి సబ్ రిజిస్ట్రార్లతో భేటీ అయ్యి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టత ఇవ్వకుంటే వరంగల్‌లో రియల్ దందా కుంటుపడే అవకాశాలున్నాయి. శాఖకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది.

భార్యకు గుడికట్టి, విగ్రహం పెట్టిన భర్త



కొత్తగూడ, ఆగస్టు 8 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామంలో భార్యకు భర్త గుడికట్టి విగ్రహం పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. కొత్తగూడ మండలంలోని ఓటాయికు చెందిన కుడికాల రమేష్ భార్య సరస్వతి సంవత్సరం క్రితం మృతి చెందింది. ఆమె జ్ఞాపకార్థం భర్త రమేష్ తన భార్య పోలీకలతో విగ్రహం చేయించాడు. తన కుమారులు ప్రశాంత్, రోహిత్‌తో కలిసి రమేష్ తన భార్యకు కట్టిన గుడిని, విగ్రహన్ని గురువారం ఆవిష్కరించారు.

గుండెపోటుతో వృద్ధురాలి మృతి

ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఘటన ● మృతురాలు వరంగల్ జిల్లా వాసి



మామిండ్ల గౌరమ్మ



తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 8 : గుండెపోటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన మామిండ్ల గౌరమ్మ (70) అనే వృద్ధురాలు తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఉదయం తొర్రూరు ఆస్పత్రికి చికిత్స కోసం కూతురు కొమురమ్మతో కలిసి రాయపర్తి వరకు ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరుకు వస్తుండగా మార్గమధ్యలో ఛాతివద్ద నొప్పి రావడంతో ప్రయాణికులు కొం దరు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో బస్సు తొర్రూరు బస్టాండుకు చేరుకోగానే అంబులెన్స్‌లో గౌరమ్మను తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. కాగా, మృతురాలి భర్త గతంలో మరణించగా, ఆమె ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన చేతులమీదే తల్లి మృతి చెందడంతో కుమార్తె విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

కేసముద్రం, ఆగస్టు 8 : చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్‌లకు వచ్చేనెల 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో అందజేయాలని హెచ్ఎం బి.రాజుగురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ నెల నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమవుతాయని, వివరాలకు సెంటర్ కోఆర్డినేటర్ ఆగుర్తి సురేష్‌ను 929165 3497 నెంబరులో సంప్రదించాలని కోరారు.

● కురవి : కురవి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2024-25కు సంబంధించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు హెచ్ఎం వహీద్ తెలిపారు. అర్హులైన వారు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు అడిషనల్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య సెల్ : 9010451659 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నల్లబెల్లాన్ని మున్నేరువాగులో పడేసిన అధికారులు



మున్నేరువాగులో నల్లబెల్లంను నీటిలో పారేస్తున్న ఎక్సైజ్ అండ్ పోలీస్ అధికారులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : మహబూబాబాద్ పోలీస్, ఎక్సైజ్‌శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగానిర్వహించిన దాడుల్లో లభ్యమైన నల్లబెల్లంను గురువారం ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మున్నేరువాగులో పారేసినట్లు ఎక్సైజ్ సూపరిం టెండెంట్ కిరణ్, డీఎస్పీతిరుపతిరావు తెలిపారు. జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాడుల్లో లభ్యమైన 37940 కిలోల నల్లబెల్లం, 2069 కిలోల పటికను జిల్లా కేంద్రం శివారు మున్నేరులో పడేసినట్లు చెప్పారు. రూరల్ ఎస్సై దీపికరెడ్డి, కురవి ఎస్సై గోపి, ఏఎస్సైలు రమేష్, సురయ్య, ఎక్సైజ్‌పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మగుడిలో మైక్‌సెట్ అపహరణ

కేసముద్రం, ఆగస్టు 8 : మండలంలోని బేరువాడ శివారు బోడమంచ్యాతండాలో దుర్గమ్మ గుడి తాళం పగులగొట్టి గురువారం మైక్ అంప్లిఫయర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తండావాసులు తెలిపారు. ఉదయం గుడి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉండడంతో లోపల పరిశీలించగా సుమారు రూ.25వేల విలువైన అంప్లిఫయర్ చోరీకి గురైనట్లు తండావాసులు గుర్తించారు. కొద్దిరోజుల క్రితం ధన్నసరి శివారు బిచ్యానాయక్‌తండాలోని దుర్గమ్మగుడిలో ఇదే తరహాలో తాళం పగులగొట్టి మైక్ అంప్లిఫయర్ ఎత్తుకెళ్లగా తండావాసులు పోలీసులకు దృష్టికి తీసుకువెళ్లారు. ఇది జరిగిన కొద్దిరోజులకే గతనెల 19న రాత్రి ధన్నసరి శివారు సబ్‌స్టేషన్‌తండాలోని దుర్గమ్మగుడిలో తాళం పగులగొట్టి అమ్మవారి విగ్రహంపైనున్న సుమారు రూ.40వేల విలువైన వెండి కిరీటాన్ని, హుండీలోని చిల్లర డబ్బులను ఎత్తుకెళ్లారు. బోడమంచ్యాతండాలో చోరీ జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. నెలరోజుల వ్యవధిలో కేసముద్రం-మహబూబాబాద్ రహదారి వెంటనున్న దుర్గమ్మ గుళ్లలో వరుసగా ఈ చోరీలు జరగడంతో దుర్గమ్మ భక్తులు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ మురళీధర్‌రాజ్ మాట్లాడుతూ చోరీ ఘటనలపై విచారణ జరుపుతున్నామని, తండాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూక్యాతండాలో వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కేసముద్రం, ఆగస్టు 8 : భూక్యారాంతండాలో గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందిన వానరానికి గ్రామస్తులు అంత్యక్రియలునిర్వహించారు. డప్పుచప్పులతో సంప్రదాయబద్ధంగా అంతిమ యాత్ర నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోత్ రమేష్, నూనావత్ సురేష్, భూక్య వీరన్న, నెహ్రూ, దేవేందర్, గణేష్, నాగన్న, నరేష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు ఆహ్వానం : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 13న సాయంత్రం వరకు సే నో టు డ్రగ్స్, సే నో టు గుడుంబా, సైబర్ సెఫ్టీ, రోడ్డు సెఫ్టీ, ఫ్రెండ్లీ పోలీసింగ్, షీటీమ్స్ అంశాలపై గీసిన చిత్రలేఖనం సమీప పోలీస్‌స్టేషన్‌లలో సమర్పించాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు చెప్పారు.

కల్వల హైస్కూల్లో ఘనంగా తీజ్

కేసముద్రం, ఆగస్టు 8 : మండలంలోని కల్వల జడ్పీహైస్కూల్లో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బండారు నరేందర్ మాట్లాడుతూ గిరిజనుల సంప్రదాయంలో తీజ్ పండుగకు ఎంతో ప్రాధాన్యత గలదని తెలిపారు. అనంతరం గోధుమ బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆర్.ఏ కాంబ్రం, టి.సదానందం, బి.సత్యనారాయణ, నాగేందర్, ఎం.శ్రీనివాస్, భిక్షపతి, జుబేర్ అలీ, పీడీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.



ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయం అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న జీపీ కార్మికులు



నెల్లికుదురు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



కేసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



మహబూబాబాద్ ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న, గ్రామపంచాయతీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవికుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదని ఆరోపించారు. జీవో నెంబర్ 51, మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, సుమన్, శబరి, హసీఫ్, రవి, ఐలయ్య, మం గమ్మ, ఆలీ, శ్రీరాం, నరేష్ పాల్గొన్నారు.

● కేసముద్రం : మండలకేంద్రంలో జీపీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు డప్పుచప్పుళ్లతో కార్మికుల ర్యాలీ కొనసాగింది. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, బీర్రు కనకలక్ష్మి, సింగారపు యాకయ్య, మరియమ్మ, జ్యోతి, భోజ్యా, సౌందర్య, కవిత, సంజీవ, టేకుల శ్రీను, కృష్ణమూర్తి, గంధసిరి వెంకటేశ్వర్లు, భాను, భాస్కర్, రమేష్, అనీల్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఆందోళన చేపట్టి అధికారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, మండల అధ్యక్షుడు బోళ్ల రాములు, ఎల్లయ్య, యాకలక్ష్మి, ఉమ, దర్గయ్య, ఎల్లయ్య, బిక్షం, పార్వతమ్మ, సుగుణ, యాకమ్మ, సోమక్క పాల్గొన్నారు.

● నెల్లికుదురు : జీపీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నెల్లికుదురులోని అంబేద్కర్ సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఎంపీడీవో బాలరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు, ,పెరమాండ్ల తిలక్‌బాబు, బాబుగౌడ్ మారబోయిన శ్రీనివాస్, బొల్లం ఎల్లయ్య, వెంకన్న, రామకోటి, సుభాన్‌పాష, ఉపేంద్ర, పరుశరామ్, వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి : రాష్ట్రప్రభుత్వం వెంటనే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 17 జీపీల సిబ్బంది సఫాయి సమ్మెలో పాల్గొని ఎంపీడీవో కార్యాలయం ఎదుట వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కారోబార్లు, సిబ్బంది యాకన్న, భద్ర, కిష్టునాయక్, బద్రు, రాములు పాల్గొన్నారు.



నేతాజీతండా పాఠశాలలో చేరిన వరద నీరును తొలగిస్తున్న దృశ్యం

స్కూల్లో వరదనీరు తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 8 : వర్షాలకు పెనుగొండ శివారు ఉత్తరతండా గ్రామపంచాయతీ పరిధిలోని నేతాజీ ప్రాథమిక పాఠశాలలో భారీగా చేరిన వరదనీరును అధికారులు తొలగించారు. 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో గురువారం 'జోరువాన' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు తీవ్రంగా స్పందించారు. భారీ వర్షానికి వరదలు ప్రవహించడంతో ఆ ప్రాథమిక పాఠశాలలోకి వరదనీరు భారీగా చేరడంతో చదువుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో స్పందించిన ఉత్తరతండ ప్రత్యేక అధికారి ఎన్.తిరుపతిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.మల్లేష్, ఎంపీవో రఘుపతి రెడ్డి, హెచ్ఎం బి.ప్రతాప్, ఉపాధ్యాయురాలు స్వాతి, రైతులు సుమన్, వీరన్న, వెంకన్న, జనార్ధన్, రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి వరదనీటిని పూర్తిగా తొలగించారు.

వర్గీకరణ తీర్పు మాదిగల విజయం కాదు

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : వర్గీకరణ తీర్పు మాదిగల విజయం కాదని.. అది మనువాదుల విజయమని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ విభజించు పాలించు అన్న సూత్రాన్ని పాటిస్తూ ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను పావుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలని కోరారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర, జిల్లానాయకులు చంద్రశేఖర్, నర్సింగరావు, పురుషోత్తం, వెంకటస్వామి, రాజు, రవికాంత్, సమ్మయ్య, ప్రభాకర్, రాములు, సాంబయ్య,తిరుపతి, సాయి, వినయ్ పాల్గొన్నారు.



న్యూఢిల్లీలోని ధర్నా నిర్వహిస్తున్న మాల మహానాడు నేతలు



మానుకోట జిల్లా కోర్టులో విధులను బహిష్కరిస్తున్న న్యాయవాదులు

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : జనగామ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదుల దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టులో న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించినట్లు మహబూబాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఎదుట కొద్దిసేపు న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ జనగాం పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదుల దంపతులు గద్దల అమృతరావు-కవితలపై అకారణంగా చేయి చేసుకున్న సీఐ, ఎస్సైను సస్పెండ్ చేసి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో న్యాయవాదులు కొండపల్లి కేశవరావు, మేక సురేష్‌రెడ్డి, వెంకటయ్య, తుంపిళ్ల శ్రీనివాస్, మామిడాల సత్యనారాయణ, పుల్లూరు కృష్ణయ్య, దర్శనం రామకృష్ణ, సత్యనారాయణ, సోమిరెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, జలేందర్, ఆనంద్, సునీత, రాజమణి, శృతి పాల్గొన్నారు.

అడవులను కాపాడుకోవాలి

● గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్

గూడూరు, ఆగస్టు 8 : అంతరించి పోతున్న అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్ అన్నారు. డీఎఫ్‌వో విశాల్ ఆదేశాల మేరకు దామర వంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాల-కళాశాల, సీతానగరం ఆశ్రమ ఉన్నత పాఠశాల, గూడూరు జ్యోతి రావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధునిక అటవి సంరక్షణ, అడవుల ప్రాముఖ్యత, వన్య ప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంలో వాటి ప్రాముఖ్యతపై జూనియర్, సీనియర్‌లుగా రెండు కేటగిరిల వారీగా విభజించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దామరవంచ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి బి.ప్రభాస్, ద్వితీయ బహుమతి సీహెచ్.బన్ని, తృతీయ బహుమతి రాంచంద్, జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి వి.గణేష్, ద్వితీయ బహుమతి రాజేష్, తృతీయ బహుమతి చరణ్, సీతానగరం సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి దినేష్‌కుమార్, ద్వితీయ బహుమతి బి.హర్ష, తృతీయ బహుమతి బి.సుభాష్, జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి ఖాదర్‌పాషా, ద్వితీయ బహుమతి బి.అఖిల్, తృతీయ బహుమతి ఎన్.నితిన్, జ్యోతిరావుపూలేలో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి జి.దివ్య ద్వితీయ బహుమతి బి.హారిక, తృతీయ బహుమతి జి.రక్షిత, జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి బి.అక్షిత, ద్వితీయ బహుమతి బి.రుతిక, తృతీయ బహుమతి వి.తస్వీలు గెలుచుకున్నారు. వారికి మెమోంటోలు,ప్రశంసా పత్రాలను అందించారు. డీఆర్వోలు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు మాధవి, లక్ష్మీనర్సు, శ్రీను, హర్దిసింగ్, మంగమ్మ, మోహన్, బిక్షపతి, వెంకటేశ్వర్లు, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సోమేష్‌రెడ్డి, మొగిలయ్య, సుగుణ, కవిత, శారద, పుష్పలత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాలో 832.8 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 8 : జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 832.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బయ్యారం, మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, మహబూబాబాద్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొత్తగూడలో 5.4, బయ్యారంలో 84.2, గార్లలో 55.8, డోర్నకల్‌లో 53.2, కురవిలో 48.4, మహబూబాబాద్‌లో 68.4, గూడూరులో 46.4, కేసముద్రంలో 45.6, నెల్లికుదురులో 71.8, నర్సింహులపేటలో 75.4, చిన్నగూడూరులో 62.6, మరిపెడలో 78.0, దంతాలపల్లిలో 52.2, తొర్రూరులో 52.8, పెద్దవంగరలో 32.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 52.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

డీఐ రామిరెడ్డిని కఠినంగా శిక్షించాలి : బీఎస్పీ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : దళిత మహిళను వేధించిన షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ (డీఐ) రామిరెడ్డిని కఠినంగా శిక్షించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పోకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, ఎల్.విజయ్‌కాంత్, ప్రసాద్‌రావు, శ్రీను, ఉపేందర్, పాల్వాయి బుచ్చిరాములు, నరేష్, తప్పెట్ల చాణక్య కె.వెంకటేష్, వినయ్, శ్రీను, ఉదయ్ పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి : ఆర్డీవో

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే జాతీయ రహదారి (930పీ) నిర్మాణానికి రైతులు సహకరించాలని మానుకోట ఆర్డీవో అలివేలు కోరారు. మహబూబాబాద్ తహసీల్ ఆఫీస్‌లో జాతీయ రహదారి నిర్మాణంతో భూములు కోల్పోయే రైతులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 930పీ జాతీయ రహదారి జిల్లాలోని మహబూబాబాద్, కురవి, బయ్యారం, గార్ల మీదుగా పోతుందని, అందుకు 46.52 హెక్టార్ల భూమి అవసరం ఉందన్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే దశల వారీగా ఆందోళనలు చేపడుతామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించి అధికారికి వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, వెంకటేశ్వర్లు, ఉమగాని సత్యం, భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, రంగయ్య, కొమ్మాలు, సురేష్, అశోక్, రవీందర్ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల కోసం పోరాడుదాం

● ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 8 : ఆదివాసీల హక్కుల కోసం అంతా కలిసి ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవుల నుంచి ఆదివాసీలను పాలకులు తరలించే ప్రయత్నం చేస్తున్నారని, దానిని అందరం కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కె.మదార్, ఉపేందర్, బాబన్న, షర్ఫోద్దీన్, దేవేందర్, సుధాకర్, వెంకన్న, లింగయ్య, ఐలయ్య, సరిత, జ్యోతి, పాపక్క పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తొర్రూరు, ఆగస్టు 8 : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పలు వార్డుల్లో జ్వరాలపైన అవగాహన, పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులతో మాట్లాడారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వార్డు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేసీఆర్, ఎర్రబెల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పెద్దవంగర, ఆగస్టు 8 : మండలంలోని ఖంద్యతండా, వంపుతండా, బొత్తలతండా, టిక్యాతండా, జయరామ్‌తండాలను జీపీలుగా గుర్తించడంతో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మాట్లాడుతూ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషి వల్ల నేడు మండలంలో ఆరు గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయని తెలిపారు. కిష్టుతండా జీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా దానిని గుర్తించకపోవడం సరైనది కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కనుకంట్ల వెంకన్న, చింతల భాస్కర్, పటేల్‌నాయక్, కుమారస్వామి, చంద్రబోస్, యాకన్న, సతీష్, కుమారస్వామి, సొంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పెద్దవంగర, ఆగస్టు 8 : సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించేతత్వాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన రాంపాక రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.11వేలను ఆర్థిక సాయం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు జలగం సతీష్, అనపురం రవి, ఎర్ర వెంకన్న, మల్లికార్జున చారి, ఎవడవెల్లి మధుసూదన్‌రెడ్డి, గ్రామస్థులు కిరణ్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

'పోలీస్‌శాఖలో బదిలీలు అనివార్యం'

తొర్రూరు, ఆగస్టు 8 : పోలీస్‌శాఖలో బదిలీలు అనివార్యమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో తొర్రూరు సిఐగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సిఐ సంజీవను, ఎస్సై జగదీష్‌లను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తాము పనిచేస్తున్న ప్రాంతంలో ప్రజల అభిమానాన్ని చూరగొనాలని తెలిపారు. బదిలీ అయిన ప్రతీసారి బాధ ఉంటుందని, ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జె.చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు పాల్గొన్నారు.

భగీరథ నీటి నాణ్యత ప్రామాణికాన్ని పరిశీలించిన అధికారులు

దంతాలపల్లి, ఆగస్టు 8 : మండల కేంద్రంలో గురువారం మిషన్ భగీరథ అధికారుల బృందం సభ్యులు ఇంటింటా నీటి నాణ్యత ప్రామాణికాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం అధికారి సుధాకర్ మాట్లాడుతూ ప్రతీ రోజు ప్రజలకు ప్రభుత్వం అందించే నీటి నాణ్యతను పరీక్షిస్తారన్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు. సరఫరా అయ్యే నీటిని కలుషితం కాకుండా మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భగీరథ ఏఈ ప్రదీప్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న, కారోబార్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కురవిలో ఫీవర్ సర్వే

కురవి, ఆగస్టు 8 : 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా గురువారం కురవిలో ప్రత్యేక అధికారి జి.నర్సింహస్వామి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, వైద్యాధికారులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ జ్వరపీడితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో ఎవరూ బాధపడుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహాలు, విహారయాత్రలకు 10 శాతం రాయితీతో అద్దెకు బస్సులు

● మానుకోట ఆర్టీసీ డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8 : శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 3 వరకు వివాహాలు, శుభకార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపోమేనేజర్ ఎం.శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, శుభకార్యాలకు టీజీ ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి తక్కువ ఖర్చుతో ఎటువంటి డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీతో సౌకర్యవంతంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను అద్దెకు ఇవ్వబడునని చెప్పారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





రజాలీపేట వద్ద పశువులను తరలిస్తున్న లారీని అడ్డుకున్న బీజేపీ నేతలు

పశువుల రవాణాను అడ్డుకున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వాంచ సమీపంలోని బంజరా గ్రామం నుంచి హైదరాబాద్‌కు లారీలో తరలిస్తున్న పశువులను మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రజాలీపేట పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి బీజేపీ నాయకులు అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళ నాయకురాలు దార ఇందుభారతి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కబేలాకు పాల్వాంచ సమీపంలోని బంజరా నుంచి లారీలో 35 పశువులను కుక్కి, తాళ్ల కట్టేసి తరలిస్తున్నారన్న సమా చారంతో రజాలీపేటసమీపంలో అడ్డుకుని కురవి ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేపడుతున్నారు. అవి కబేలాకే తరలిస్తున్నారా.. లేదా అనే కోణంలో విచారణ ప్రారంభించారు.

బోదకాలు నివారణకు ప్రత్యేక చర్యలు

మహబూబాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బోదకాలు నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ఈనెల 10 నుంచి 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం బోదకాలు నివారణపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10 నుంచి బూత్‌ల వారీగా అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని సంక్షేమహాస్టళ్లు, విద్యాసంస్థల్లో స్వయం సహాయక బృందాలు ప్రతి ఒక్కరిలో బోదకాలు నివారణ మాత్రలు ఎలా వేసుకోవాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 10 నుంచి 12 వరకు బూత్‌లెవల్, 13 నుంచి 22 వరకు ఇంటింటికి, 23 నుంచి 25 వరకు మిగిలిన వారికి ఈ మాత్రలు అందజేయడం జరుగుతుందన్నారు.


మరణించినా సజీవమే..

(5వ పేజీ తరువాయి)

సమావేశాలు నిర్వహిస్తూ చైతన్యం నింపుతున్నారు. ఇప్పటికే సంఘం తరఫు కుటుంబ సభ్యులకు అవగాహన పర్చి, వారి సహకారంతో రెండు దేహాలను మానుకోట వైద్యకళాశాలకు అప్పగించారు. ఇప్పటి వరకు 360 అవయవదాన పత్రాలను స్వీకరించారు. ప్రతీ ఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అవయవదానం చేయడానికి ముందుకు రావాలి..

పర్కాల రవీందర్‌రెడ్డి, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు, మానుకోట



ప్రతి ఒక్కరు అవయవదానం చేయడానికి ముందుకు రావాలి. ఒకరి అవయవదానంతో ఏడుగురిని బతికించుకునే అవకాశం ఉంది. చనిపోయాక మృతదేహాన్ని కాల్చడం ద్వారా వచ్చేది ఏముండదు. దేహాన్ని వైద్యకళాశాలకు దానం చేస్తే వైద్యవిద్యకు దోహదం చేసిన వారమవుతాం. అవయవదానం చేసిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. వారికి పీహెచ్‌సీ సర్టిఫికేట్ ఇచ్చి ఆదుకోవాలి. ఇది కొన్ని రాష్ట్రాల్లో అమలవుతుంది. ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం ఆలోచించాలి. అవయవదానంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలి.